క్లుప్తంగా

విద్యార్థులకు వైద్య పరీక్షలు



విద్యార్థినికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టరు మనోజ్

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని ఇ.తాండ్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టరు మనోజ్ మంగళవారం పంచలింగాల గ్రామం కేజీబీవీ హాస్టల్, ఏపీ రెసిడెన్షియల్ మైనారిటీ బాలికల హాస్టల్‌ను సందర్శించి విద్యార్థులకు వైద్యా ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రస్తుత సీజన్‌లో డయేరియా, విషజ్వరాలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రతి రోజుసురక్షిత నీరు, శుభ్రమైన ఆహారం తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి మక్బుల్, పీహెచ్ఎన్ నిర్మలదేవి, ఎంపీహెచ్ దానమ్మ, కేజీబీవీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆర్‌జీఎంలో ఎలక్ట్రికల్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న చెర్మన్ శాంతిరాముడు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ మెట్ట వద్ద ఉన్న ఆర్‌జీఎం ఇంజినీరింగ్ కళాశాలలో ఎలక్ట్రిక్ వెహికల్ ల్యాబ్‌ను చెర్మన్ శాంతిరాముడు మంగళవారం ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణతో పాటు భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఎలక్ట్రిల్ వెహికల్ టెక్నాలజీ అత్యంత కీలకమన్నారు. ఈ రంగంలో నైపుణ్యం సాధించడం ద్వారా విద్యార్థులు ప్రపంచ స్థాయి అవకాశాలను పొందవచ్చన్నారు. కార్యక్రమంలో డీన్ అశోక్‌కుమార్, ప్రిన్సిపాల్ జయచంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు, పేదలు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గొందిపర్ల గ్రామంలో చిప్పరౌస్ ప్రభుత్వ స్థలంలో కొట్టాలు వేసుకున్న పేదలకు ఇంటి పట్టాలు అందజేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి. రామకృష్ణ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన పేదలతో కలిసి కర్నూలు రూరల్ తహసీల్దారు రమేష్ బాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం సీపీయం నాయకులు మాట్లాడుతూ దాదాపు 100 కుటుంబాలు 40 ఏళ్ల నుంచి కొట్టాలు వేసుకొని నివసిస్తున్నారని, ఇప్పటి వరకు ఇళ్ల పట్టాలు ఇవ్వలేదన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు రఘువేంద్ర, శ్రీరాములు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోండి



సి.బెళగల్‌లో రైతులతో మాట్లాడుతున్న ఏఓ మల్లేష్‌కుమార్

సి.బెళగల్: మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి అర్హత ఉండి సాయం అందని వారు నేటి సాయంత్రంలోగా దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) మల్లేష్ కుమార్ అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రం సి.బెళగల్ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో రైతులు సాగు చేసిన కంది, పత్తి పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం స్థానిక రైతు సేవ కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించిన ఆయన అర్హులైన రైతులు బ్యాంక్ అకౌంట్‌తో పాటు దరఖాస్తులు రైతు సేవ కేంద్రంలో అందజేయాలన్నారు. పంట బీమాకు ఈ నెలాఖరు వరకు అవకాశం ఉందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఓ సూచించారు.

నీటి ముంపు నుంచి పత్తి పంట సంరక్షణకు చర్యలు

కాగా మండలంలో గత కొద్ది రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నీట మునిగిన పొలాల్లో పత్తి పంటల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని ఏఓ మల్లేష్‌కుమార్ సూచించారు. పత్తి పొలాల్లో నిలిచిన వర్షపునీరు బయటకు వెళ్లేందుకు మార్గాలు ఏర్పాటు చేసి భూములు ఆరేలా చేయాలన్నారు. తర్వాత ఎకరాకు 30 కేజీల యూరియా, 15 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ ఎరువులను పొలంలో చల్లాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ హిమబిందు, వీఏఏలు అసిఫ్, వీహెచ్ఏ అంజలి, ఎంపీఈఓ వెంకటేష్, రైతులు పాల్గొన్నారు.

వంతెన..ఇంతేనా

- ప్రమాదకరంగా మారిన కోడుమూరు హంద్రీనది వంతెన
- నిర్వహణ లేక దెబ్బతిన్న వైనం



బీటలు వారిన కోడుమూరు హంద్రీనదిపై గల వంతెన



కడ్డీలు తేలిన దృశ్యం



వంతెన పైభాగంలో రంధ్రం పడిన దృశ్యం

కోడుమూరు రూరల్: కర్నూలు నుంచి బళ్లారికి వెళ్లే రోడ్డులో కోడుమూరు వద్ద హంద్రీనదిపై నిర్మించిన వంతెన ప్రమాదకరంగా మారింది. ఏళ్ల గడిచినా ఈ వంతెన మరమ్మతులకు అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో బీటలు వారి కడ్డీలు తేలాయి. అక్కడక్కడా రంధ్రాలు సైతం పడ్డాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. కర్నూలు నుంచి గుంతకల్, పత్తికొండ, ఆలూరు, బళ్లారి వైపు వెళ్లే వాహనాలన్నీ ఈ వంతెన మీదుగానే రాకపోకలు సాగిస్తాయి. ఇంతటి ప్రధాన రోడ్డులో గల వంతెన పూర్తిగా దెబ్బతిని కుంగిపోతున్నా అధికారులు చోద్యం చూస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.



హుసేనాపురంలో శ్రీకృష్ణుని ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

వేడుకగా శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపు

ఓర్వకల్లు: మండలంలోని హుసేనాపురంలో మంగళవారం శ్రీకృష్ణుడి ప్రతిమ ఊరేగింపును ఘనంగా నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఇందూ విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో భక్తులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా 4వ రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్థానిక ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు వద్ద నుంచి రామాలయం, సంతమార్కెట్, సుంకులమ్మ గుడి మీదుగా ఊరేగింపు నిర్వహించే తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఈ సందర్భంగా భక్తుల భగవద్గీత శ్లోక పారాయణ స్మరణతో పురవీధులు మార్మోగాయి. భక్తులు శ్రీకృష్ణుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు ఈశ్వరయ్య, పురుషోత్తం, గంగాధర్, శ్రీనివాసులు, రాము, ఓబులేసు, రామచంద్రుడు, అనిల్, అజయ్, శ్రీదేవి, ధనలక్ష్మి, లక్ష్మీదేవి, వరలక్ష్మి పాల్గొన్నారు.

నదితీర ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు(రూరల్): తుంగభద్ర నదికి భారీగా వరద నీరు వస్తున్న నేపథ్యంలో నదితీర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కర్నూలు రూరల్ తహసీల్దారు రమేష్ బాబు సూచించారు. నదికి సుమారు 1,35,000 వేల క్యూసెకుల నీరు వస్తోందన్నారు. సుంకేసుల, ఆర్.కె. దుద్యాల, ఎదురూరు, ఆర్.కొంతలపాడు, జి. సింగవరం, నిడ్జురు, పంచలింగాల, ఈ.తాండ్రపాడు, గొందిపర్ల దేమాడ, పడిదెంపాడు, పూడూరు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. చేపల వేటకు, బట్టలు శుభ్రపరిచేందుకు, స్నానాల కోసం ఎవరూ నదివైపు వెళ్లరాదని ఇప్పటికే గ్రామాల్లో దండోర వేయించినట్లు తహసీల్దార్ వెల్లడించారు.

భోగేశ్వరుడికి ప్రత్యేక పూజలు

గడివేముల: మండల పరిధిలోని ఎర్రమల కొండల్లో కొలువైన శ్రీదుర్గా, భోగేశ్వరస్వామి వారికి ఏకాదశి, ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివార్లకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకులు శ్యాంసుందర్ శర్మ, గిరినాథశర్మ ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో పలు ప్రాంతాల భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో అభిషేకం, అర్చనలు చేశారు.

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు

కల్లూరు: మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు అవుతాయని డీసీపీఓ శారద అన్నారు. మంగళవారం జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీపీఓ శారద మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల ఉజ్వల భవిష్యత్తు నాశనమవుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుల పింఛన్లు పునరుద్ధరించాలి



ఏఓ వెంకటరామయ్యకు వినతి పత్రం అందజేస్తున్న నాగన్న

ఓర్వకల్లు : అనర్హుల పేరుతో తొలగించిన దివ్యాంగుల పింఛన్లను వెంటనే పునరుద్ధరించాలని వ్య.కా.స జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాలకు చెందిన దివ్యాంగులు ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా నాగన్న మాట్లాడుతూం.. రెండు రోజుల క్రితం వరకు పింఛన్లు అందుకుంటున్న దివ్యాంగులకు ఒక్కసారిగా అనర్హులు అంటూ నోటీసులు ఇవ్వడం దారుణమని విమర్శించారు. వీటిని గ్రామ పంచాయతీ అధికారులు లబ్ధిదారుల ఇళ్లకే అతికించడం సిగ్గుచేటని అన్నారు. 20 ఏళ్లగా పింఛన్లు పొందుతున్న దివ్యాంగులకు కూడా నోటీసులు ఇవ్వడం అన్యాయమని ప్రశ్నించారు. గతంలో వైద్యులు 80–90 శాతం వికలత్వం ఉన్నట్లు గుర్తించి సర్టిఫికెట్లు మంజూరు చేస్తే, ప్రభుత్వం మారిందని వికలత్వం తగ్గిపోదని వ్యాఖ్యానించారు. శకునాల గ్రామానికి చెందిన పుట్టుకతోనే దివ్యాంగురాలైన కానుగల లల్లీకి కూడా నోటీసు ఇవ్వడం దయనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారలు దివ్యాంగుల సమస్యలను పరిగణనలోకి తీసుకొని, వారి పింఛన్లను పునరుద్ధరించాలని కోరుతూ పరిపాలన అధికారి వెంకటరామయ్యకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మహబూబ్‌బాషా, మద్దిలేటి, శకునాల, కన్నమడకల, కాల్వ గ్రామాలకు చెందిన దివ్యాంగులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి



గార్గేయపురంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న రజక వృత్తిదారుల నాయకులు

కర్నూలు(రూరల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రజకులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజక వృతిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుశేఖరు డిమాండ్ చేశారు. మంగళవారం మండల పరిధిలోని గార్గేయపురం, పడిదెంపాడు గ్రామాల్లో. రజకవృతి దారులతో ఆయన సమావేశమై మాట్లాడారు. ఎన్నికల ముందు కూటమి సర్కారు రజక వృతిదారులకు చెరువులపై హక్కులు కల్పిస్తామని, జీవో నెంబర్ 27 ప్రకారం ప్రభుత్వరంగ సంస్థల్లో ఖాళీ ధోబీ పోస్టులను భర్తీ చేస్తామని, లాండ్రీ షాపులకు, ధోబీఘాట్లకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ తదితరవి ఇస్తామని చెప్పిందన్నారు.అయితే, ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు పూర్తవుతున్నా ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. ఈ హామీల అమలు కోసం ఈనెల 25న జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రజకులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శేఖరుబాబు, జిల్లా కమిటీ సభ్యులు సి. ఎల్లయ్య, సంజీవ్ పడిదెంపాడు, గార్గేయపురం రజక వృత్తిదారులు నాయకులు పాల్గోన్నారు.

హాస్టల్ విద్యార్థుల అస్వస్థతపై విచారణ



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుంటున్న ఆర్డీఓ సందీప్‌కుమార్

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లులోని ప్రభుత్వ బాలుర వసతి గృహంలో చోటుచేసుకున్న విద్యార్థుల అస్వస్థతపై కర్నూలు ఆర్డీఓ సందీప్ కుమార్, హుసేనాపురం వైద్యాధికారిణి రేఖ, తహసీల్దార్ విద్యాసాగర్ మంగళవారం క్షేత్రస్థాయిలో విచారణ చేశారు. ముందుగా కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన బాధిత విద్యార్థులను పరామర్శించి, వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. అనంతరం హాస్టల్ గదులు, మరుగుదొడ్లు, ఆర్ఓ ప్లాంట్, వంటగది డైనింగ్ హాల్ తదితర వాటిని పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. మూడు రోజుల క్రితం వెలుగుచూసిన విద్యార్థుల అస్వస్థకు గల కారణం కేవలం హాస్టల్ వార్డెన్ సుంకన్న ఆ సమయంలో అందుబాటులో లేకపోవడం, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కారణమన్నారు. హాస్టల్‌లో సక్రమంగా మెనూను పాటించకుండా అస్తవ్యస్తంగా ఆహారం పెట్టడంతోనే విద్యార్థులు తరచుగా అస్వస్థకు గురవుతున్నట్లు విచారణలో తేలిందన్నారు. వంటగదులు, శుద్ధజల ప్లాంట్ నిర్వహణ సక్రమంగా లేవని, వీటిపై నివేదికలను తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు సమర్పించనున్నట్లు తెలిపారు. బాధిత విద్యార్థులకు వైద్యాధికారి రేఖ పరీక్షలు నిర్వహించి, ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు నిర్ధారించారని పేర్కొన్నారు. ఇకపై ఇలాంటి ఘటనలు చోటుచేసుకోకుండా సంబంధిత వార్డెన్‌పై చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ విద్యాసాగర్, ఆహార భద్రత అధికారులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

భయం.. భయంగా

- మట్టి మిద్దెల కింద జీవనం
- వర్షాలకు కూలుతున్న ఇళ్లు
- బిక్కుబిక్కుమంటున్న చెంచులు



చెమ్మగా మారిన ఇంటి గోడలు



తడవకుండా ఇంటికి కప్పిన పట్ట



కూలిపడిన పైకప్పు

పాణ్యం: కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో స్థానిక చెంచు కాలనీలోని మట్టి మిద్దెలు తడిసి కూలిపోతున్నాయి. ఎప్పుడు కూలుతాయోననే భయంతో వృద్ధులు, మహిళలు, పసిపిల్లలు ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకుని గడుపుతున్నారు. టార్పాలిన్ పట్టల కింద సామాన్లతో ఆరుబయట కాలం వెల్లదీస్తున్నారు. కాలనీలో దాదాపు 75 మట్టి ఇళ్లు ఉండగా, ఇవి 30 ఏళ్ల కిందట నిర్మించినవే. వర్షాల కారణంగా గోడల్లో చెమ్మపట్టిపోవడంతో నీరు కారుతోంది. దుర్వాసనతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి ఏర్పడింది. చిన్నపాటి వర్షానికే పైకప్పులు కూలిపోతున్నాయి.

కొత్త ఇళ్లు ఆలస్యం

పీఎం జన్మన్ పథకం కింద ఒక్కో ఇంటికి రూ.3.39 లక్షలు మంజూరు చేశారు. చెంచుల కాలనీలో 173 ఇళ్లు కేటాయించగా కొన్ని స్లాబ్ దశలో, మరికొన్ని నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఈ వర్షాకాలానికే పూర్తవ్వాల్సిన ఇళ్లు ఇంకా పూర్తి కాలేదు. ఇళ్లు త్వరగా పూర్తయితే తమకు మట్టి మిద్దెల బాధ తప్పుతుందని చెంచులు వాపోతున్నారు. పిల్లలను, వృద్ధులను కాపాడుకోవడం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు

75 ఇళ్లను గుర్తించాం

చెంచుకాలనీలో 75 మట్టి మిద్దెలు బలహీనంగా ఉన్నాయి. ఒక ఇల్లు ఇప్పటికే కూలిపోయింది. ప్రజలు సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించాం. రాత్రివేళ ఇబ్బందులు రాకుండా ప్రభుత్వ పాఠశాలల్లో తాత్కాలిక ఆశ్రయం కల్పించాం. వారికి అవగాహన కల్పించి మట్టిమిద్దెల కింద ఉండకుండా చూడాలని రెవెన్యూ అధికారులకు సూచించాం. – రామ్, ఆర్ఐ

నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలి

- జాయింట్ కలెక్టర్ నవ్య



రైతు సేవా కేంద్రంలో ఎరువులను పరిశీలిస్తున్న జేసీ నవ్య

కల్లూరు: రైతులు నానో యూరియా, నానో డీఏపీ ఎరువులు వినియోగించేలా ప్రోత్సహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ బి. నవ్య అధికారులకు సూచించారు. మంగళవారం కల్లూరు మండలం కె. మార్కాపురం, ఎ.గోకులపాడు, కర్నూలు మండలంలోని గార్గేయపురం రైతు సేవా కేంద్రాలు, గార్గేయపురం వ్యవసాయ సహకార సంఘాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ.. సాధారణ ఎరువుల మాదిరి నానో ఎరువులు పంటల దిగుబడుల్లో ఫలితాలను ఇస్తాయన్నారు. రైతులు నానో యూరియాతో ఫోలియర్ స్ప్రే చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రైతులు యూరియాను అధికంగా వినియోగించవద్దని సూచించారు. అన్ని ఆర్ఎస్‌కేలలో సిబ్బంది నానో యూరియా, నానో డీఏపీ ఇండెంట్లు వేయాలని జేసీ ఆదేశించారు. రైతులు సమతుల్యంగా ఎరువుల వినియోగం, నానో ఎరువుల ప్రయోజనాలు, నేల సారవంతం కాపాడుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. రైతు సేవా కేంద్రాల సిబ్బంది పంట నమోదు కార్యక్రమం వేగవంతం చేసి, పకడ్బందీగా ఈ–పంట నమోదు చేయాలన్నారు. ఆయా కేంద్రాల్లో ఉన్న ఎరువుల నిల్వలు, రైతులకు అందజేస్తున్న సేవలను పరిశీలించారు. కె.మార్కాపురం రైతు సేవా కేంద్రంలో 45 మెట్రిక్ టన్నుల యూరియాకు గాను 41 మెట్రిక్ టన్నులు 231 మంది రైతులకు విక్రయించినట్లు గుర్తించారు. ఎ. గోకులపాడు ఆర్ఎస్‌కేలో 35 మెట్రిక్ టన్నులకు 34 మెట్రిక్ టన్నులు 217 మంది రైతులకు, గార్గేయపురం ఆర్ఎస్‌కేలో 37.8 మెట్రిక్ టన్నులకు 25.6 మెట్రిక్ టన్నులు, గార్గేయపురం సహకార సంఘం ద్వారా 92.7 మెట్రిక్ టన్నుల యూరియా రైతులకు విక్రయించినట్లు గుర్తించారు. ఏడీఏ సాలురెడ్డి, కల్లూరు, కర్నూలు మండలాల వ్యవసాయ అధికారులు విష్ణువర్ధన్ రెడ్డి, రూఫస్ రోనాల్డ్ పాల్గొన్నారు.

వెంకాయపల్లె ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు





ప్రత్యేక అలంకరణలో ఎల్లమ్మ, అమ్మవారిని దర్శించుకునేందుకు బారులుదీరిన భక్తులు

కర్నూలు(రూరల్): నగర శివారులో వెలసిన వెంకాయపల్లె ఎల్లమ్మకు మంగళవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూకట్టారు. కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. శ్రావణ మాసం నేపథ్యంలో మహిళలు నాగులకట్ట దగ్గర ప్రత్యేక పూజలు చేశారు. నూతన వధూవరులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది

వైఎస్సార్‌సీపీ నేత ఆత్మహత్య



శిరుప శ్రీనివాసరెడ్డి (ఫైల్)

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ జిల్లా రైతు విభాగం మాజీ అధ్యక్షుడు శిరుప శ్రీనివాసరెడ్డి (55) మంగళవారం ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మూడు రోజుల క్రితం నంద్యాలలోని ఆయన నివాసంలో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది. ఈ ఘటన మంగళవారం వెలుగులోకి వచ్చింది. మృతదేహం డీకంపోజ్ అయ్యింది. ఆత్మహత్యకు గల కారణాలను సూసైడ్ లెటర్ రాసి ఉంచినట్లు సమాచారం. అయితే ఈ విషయాన్ని పోలీసులు వెల్లడించడం లేదు. బంధువుల ఫిర్యాదు మేరకు నంద్యాల పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాసరెడ్డి ఆత్మహత్యకు కుటుంబ కలహాలు కారణమా..మరి ఏమైనా ఇతర కారణాలు ఉన్నాయనేది పోలీసుల దర్యాప్తులో తెలియాల్సి ఉంది. ఈయన ఏకైక కుమార్తె దివ్య అమెరికాలో ఉన్నారు. భార్యతో విభేదాల కారణంగా కొన్నేళ్లుగా దూరంగా ఉన్నట్లు సమాచారం. శ్రీనివాసరెడ్డి మాజీ సీఎం జగన్ మోహన్‌రెడ్డికి వీరాభిమాని. వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశారు. దీంతో ఆయన్ను పార్టీ నంద్యాల జిల్లా రైతు విభాగం అధ్యక్షుడిగా నియమించారు. ఆయన మృతిపై కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

ఘనంగా ఫొటోగ్రఫీ దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న ఫొటో, వీడియో గ్రాఫర్స్

కోడుమూరు రూరల్: అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని మంగళవారం కోడుమూరులో ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి హాజరై ఫొటో, వీడియోగ్రాఫర్స్‌తో కలిసి ఫొటో కెమెరా సృష్టికర్త లూయిస్ డగూరె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఎద్దుల మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ భూత భవిష్యత్, వర్తమానాలకు ఫొటో జ్ఞాపకాలు చిరస్మణీయమన్నారు. 18వ శతాబ్దంలో పారిస్‌లో నలుపు తెలుపులతో ప్రారంభమైన ఫొటోగ్రఫీ కాలక్రమంలో రంగులు అందుకుంటూ నేడు కొత్తపుంతలు తొక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎద్దుల సూర్యరెడ్డి, అసోసియేషన్ సభ్యులు దీప్తిరాజు, కార్తికేయ రాజు, బుజ్జన్న, నాగరాజు, అశోక్, హనుమన్న, మన్సూర్, కలాం, నబీ, శివ, ఉస్మాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

ఫొటో అంటే ఒక జ్ఞాపకం

కల్లూరు: ఫొటో అంటే జ్ఞాపకమని అలాంటి జ్ఞాపకాలను చిత్రీకరించే ఫొటోగ్రాఫర్లు ఎంతో గొప్పవారని వక్తలు అన్నారు. మంగళవారం కల్లూరు ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కల్లూరులోని ఓ ప్రైవేటు పాఠశాల ఆవరణలో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లూయిస్ డాగురే చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళుర్పించారు. ఏపీఎస్పీ 2వ బెటాలియన్ డీఎస్పీ మహబూబ్ బాషా, వక్తలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పలువురు ఫొటోగ్రాఫర్లను, విలేకరులను సన్మానించారు. నాగేశ్వరరెడ్డి మానసిక వికలాంగులకు దుప్పట్లు పంపిణీ చేశారు. వాసుదేవయ్య, శ్రీనివాస్‌రెడ్డి, గంగాధర్‌రెడ్డి, వంశీ, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



తిమ్మందొడ్డి గ్రామ కల్వర్ట్ దగ్గర రోడ్డు కూలడంతో ఏర్పడ్డ గోతులు

సి.బెళగల్: తిమ్మందొడ్డి గ్రామానికి వెళ్లే ప్రధాన రోడ్డు కుంగడంతో ప్రయాణికులకు, ప్రజలకు ప్రమాదం పొంచి ఉంది. మండల కేంద్రం సి.బెళగల్ నుంచి చింతమానుపల్లె గ్రామం మీదుగా తిమ్మందొడ్డి గ్రామానికి వెళ్లే దారిలో వంక దగ్గరున్న కల్వర్ట్‌పై మేయిన్ రోడ్డు కుంగింది. దీంతో అక్కడ మూడు భారీ గోతులు ఏర్పడ్డాయి. అయితే, ఈ గోతులు గమనించకుండా వెళ్లి పలు వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి కుంగిన రోడ్డును బాగుచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని తిమ్మందొడ్డి, చింతమానుపల్లె గ్రామస్తులు కోరారు.

పొలాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

- ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ



క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

ఓర్వకల్లు: మండలంలో వారంగా కురుస్తున్న అధిక వర్షాల నేపథ్యంలో పంట పొలాల్లో నీటి నిల్వ లేకుండా చూసుకోవాలని ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త సుజాతమ్మ రైతులకు సూచించారు. మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా శకునాల, బ్రాహ్మణపల్లె గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంట పొలాలను సందర్శించారు. వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త రవికిశోర్, మండల వ్యవసాయాధికారిణి మధుమతితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీట మునిగిన పంటల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఇందులో ప్రధానంగా పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించి తగు సూచనలు చేశారు. ముఖ్యంగా పత్తి పంటలో పూతదశ నుంచి కాయ తయారు దశలో ఉన్నాయని తెలిపారు. నీటి ముంపునకు గురైనప్పుడు పిందె, కాయలు రాలిపోవడం, ఆకులు ఎర్రబారడం, వాడి పోవడం జరుగుతుందన్నారు. అలాంటప్పుడు పొలంలో ముంపునీటిని వీలైనంత త్వరగా బయటకు పంపించేసి, 2శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణం, 1 శాతం మెగ్నీషియం సల్ఫేట్ ద్రావణం కలిపి 10 రోజుల వ్యవధిలో రెండు సార్లు పిచికారీ చేసుకోవాలని తెలిపారు. వర్షం తెరపి ఇచ్చిన తర్వాత నాఫ్తలిన్, ఎసిటిన్ ఆసిడ్(ప్లానోఫిక్స్) 1 మి.లీ 4.5 లీటర్ల నీటిలో కలిపి 200 లీటర్ల మందు ద్రావణాన్ని పిచికారి చేస్తే పూత, పిందె రాలడం నివారించవచ్చన్నారు. తెగుళ్ల నివారణ చేపట్టాల్సిన పద్ధతులు, సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈఓ మధు, వీఏఏలు, వ్యవసాయ విస్తరణ శాస్త్రవేత్త రవి కిశోర్ రెడ్డి పాల్గొన్నారు.